# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 165 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 14 మే 2026 | పేజీలు : 5




ముచ్చటగా

## మూడోసారి

- బన్నీతో మరోమారు జతకట్టనున్న పూజా

5



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మండలం, పట్టణ కమిటీలకు సంబంధించిన పూర్తిస్థాయి కార్యవర్గాన్ని వెంటనే నియమించాలని ఆదేశాలు అందాయి. జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో పూర్తి స్థాయి కమిటీలను ఈ కింది విధంగా ప్రకటిస్తున్నాం.

- జనగామ కాంగ్రెస్ పార్టీ

(ఇది ఈ నెల 8న కొమ్మూరి వర్గం విడుదల చేసిన ప్రకటన)

జనగామ జిల్లాలో మండల, పట్టణ కమిటీలు, గ్రామ కమిటీల కోసం పేర్లు సేకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంపై నాయకులు, కార్యకర్తలు ఎలాంటి అయోమయానికి గురికావద్దు. మండల, టౌన్ అధ్యక్షుల నియామకాలు అధికారికంగా ప్రకటించిన తర్వాత అన్ని వర్గాలతో సంప్రదించి వివరాలు సేకరించి, పార్టీ కోసం కష్టపడ్డ వారిని గుర్తించి పూర్తి స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తాం..

- డీసీసీ కార్యాలయం, జనగామ

(ఇది ఈ నెల 9న డీసీసీ కార్యాలయం పేరుతో విడుదల చేసిన ప్రకటన)



2

జనగామ కాంగ్రెస్‌లో

# అంతర్యుద్ధం..!

## తాజా వర్సెస్ మాజీ..!

- చాపకింద నీరులా ధన్వంతి, కొమ్మూరి వర్గపోరు?
- మండల, పట్టణ కమిటీ ఏర్పాటులో బయటపడ్డ విభేదాలు..!
- సోషల్ మీడియాలో పోటాపోటీగా పోస్టులు




కలెక్టర్ సాబ్..

# బిజీబిజీ

3

- పొద్దంతా తనిఖీలు.. సాయంత్రం సమీక్షలు
- ధాన్యం కొనుగోలుపై స్పెషల్ ఫోకస్ పెట్టిన సందీప్ కుమార్ ఝా



## జాతీయ స్థాయికి ముల్కనూరు కీర్తి

- జాతీయ స్థాయి కిక్‌బాక్సింగ్‌కు శ్రీనిధి

3 లో



యూరియా వాడకం

## తగ్గించాలి

- రఘునాథపల్లిలో 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు'

4 లో



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మండలం, పట్టణ కమిటీలకు సంబంధించిన పూర్తిస్థాయి కార్యవర్గాన్ని వెంటనే నియమించాలని ఆదేశాలు అందాయి. జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో పూర్తి స్థాయి కమిటీలను ఈ కింది విధంగా ప్రకటిస్తున్నాం.

- జనగామ కాంగ్రెస్ పార్టీ

(ఇది ఈ నెల 8న కొమ్మూరి వర్గం విడుదల చేసిన ప్రకటన)

జనగామ జిల్లాలో మండల, పట్టణ కమిటీలు, గ్రామ కమిటీల కోసం పేర్లు సేకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంపై నాయకులు, కార్యకర్తలు ఎలాంటి అయోమయానికి గురికావద్దు. మండల, టౌన్ అధ్యక్షుల నియామకాలు అధికారికంగా ప్రకటించిన తర్వాత అన్ని వర్గాలతో సంప్రదించి వివరాలు సేకరించి, పార్టీ కోసం కష్టపడ్డ వారిని గుర్తించి పూర్తి స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తాం..

- డీసీసీ కార్యాలయం, జనగామ

(ఇది ఈ నెల 9న డీసీసీ కార్యాలయం పేరుతో విడుదల చేసిన ప్రకటన)

ఢీ



2

జనగామ కాంగ్రెస్‌లో

# అంతర్యుద్ధం..!

## తాజా వర్సెస్ మాజీ..!

- చాపకింద నీరులా ధన్వంతి, కొమ్మూరి వర్గపోరు
- మండల, పట్టణ కమిటీ ఏర్పాటులో బయటపడ్డ విభేదాలు
- సోషల్ మీడియాలో పోటాపోటీగా పోస్టులు

“ జనగామ కాంగ్రెస్ పార్టీలో అంతర్యుద్ధం జరుగుతోందా..? డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మధ్య విబేధాలు కొనసాగుతున్నాయా.. అంటే.. అవును అనే సమాధానం వస్తోంది. ఇటీవల కాలంగా జిల్లా పార్టీలో జరుగుతున్న పరిణామాలు చూస్తే కాంగ్రెస్‌లో వర్గపోరు నివురుగప్పిన నిప్పులా కొనసాగుతున్నట్లు స్పష్టం అవుతోంది. - ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా

### ఎవరికి వారే..యమునా తీరే..

కాంగ్రెస్ పార్టీ గ్రామ స్థాయిని మరింత బలోపేతం చేసేందుకు హైకమాండ్ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో జిల్లా కమిటీల ఏర్పాటుపై అర్హులైన అభ్యర్థుల నుంచి క్షేత్రస్థాయిలో దరఖాస్తులు స్వీకరించి అన్ని పరిశీలించిన తర్వాత జిల్లా కమిటీలను ప్రకటించింది. జనగామ నుంచి దాదాపు 50 నుంచి 60 మంది జిల్లా అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకుంటే అనూహ్యంగా హైకమాండ్ ఎస్టీ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇచ్చి ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్ పర్సన్‌గా పనిచేసిన లకావత్ ధన్వంతికి అవకాశం కల్పించింది. దీంతో అప్పటి వరకు జిల్లా అధ్యక్ష పదవిలో ఉన్న కొమ్మూరి ప్రతాప్ రెడ్డికే రెండో సారి అవకాశం వస్తుందనుకున్న ఆయన వర్గీయులకు పరాభవం తప్పలేదు. ఇదిలాఉంటే అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత ధన్వంతి అందరినీ కలుపుకుని ముందుకు సాగుతానని ప్రకటించినా.. పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా తయారైనట్టు తెలుస్తోంది. పార్టీ పిలుపు మేరకు చేపట్టే కార్యక్రమాలను రెండు వర్గాలు చీలిపోయి నిర్వహిస్తుండడంపై కార్యకర్తల్లో అయోమయం నెలకొంది.








### ఇల్లే పార్టీ ఆఫీస్..

వందేళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి జనగామలో సొంత భవనం లేకపోవడవం విచారకరం. పార్టీకి ఎవరు అధ్యక్షులుగా ఉంటే వారి ఇల్లే పార్టీ కార్యాలయంగా మారడం అనవాయితీగా కొనసాగుతుంది. గతంలో పార్టీ అధ్యక్షుడిగా ఉన్న కొమ్మూరి ప్రతాప్ రెడ్డి తన ఇంటి జిల్లా పార్టీ కార్యాలయాన్ని కొనసాగించగా.. ప్రస్తుత అధ్యక్షురాలు ధన్వంతి కూడా తన ఇంటిలోని ఓ పెంట్ హౌస్‌లో పార్టీ ఆఫీస్ ఏర్పాటు చేయండం గమనార్హం. దీంతో పార్టీ నమ్ముకుని ఉన్న కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పార్టీకి చెందిన కార్యక్రమాలు చేపట్టాలన్నా.. వాటిలో పాల్గొనాలన్నా అయోమయానికి గురవుతున్నారు. గతంలో పార్టీ ఆఫీస్ వెళ్లాలా.. లేక డీసీసీ అధ్యక్షురాలు ఏర్పాటు చేసిన ఆఫీస్‌కు వెళ్లాలా అని తలలు పట్టుకుంటున్నారు. కొందరైతే మధ్యే మార్గంగా ఎక్కడికి వెళ్లకుండా మిన్నకుంటున్నారు.

### కమిటీల కోసం పోటాపోటీ పోస్టులు..



జిల్లా అధ్యక్షురాలిగా ధన్వంతి ఎన్నికైన తర్వాత హైకమాండ్ జనగామ జిల్లా కమిటీని ఏర్పాటు చేస్తూ ఈ నెల 2న ప్రకటన విడుదల చేసింది. ఇందులో జిల్లాలోని మూడు నియోజకవర్గాల నుంచి 69 మందిని ఎంపిక చేశారు. అయితే ప్రకటించిన కమిటీలో ఉన్న వారిని స్టేషన్ ఘన్‌పూర్ నుంచి అక్కడి ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పాలకుర్తి నుంచి టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి అక్కడి నేతలను ప్రతిపాదించగా.. జనగామ మాత్రం జిల్లా అధ్యక్షురాలిగా ఉన్న ధన్వంతికి ప్రాధాన్యం దక్కలేదని తెలుస్తోంది. ఇక్కడి నుంచి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ప్రతిపాదించిన వారిని మాత్రమే కమిటీలోకి తీసుకున్నట్టు సమాచారం. దీంతో ఇరువర్గాల మధ్య గ్యాప్ మరింత పెరిగినట్టు తెలుస్తోంది. పార్టీ కోసం ఏళ్ల నుంచి శ్రమిస్తున్న వారిని కాదని నిన్న మొన్న వచ్చిన వారికి జిల్లా స్థాయి పదవులు ఇవ్వడంపై కొందరు సీనియర్ నేతలు సైతం గుర్రు మీద ఉన్నారు. ఇదిలాఉంటే గత వారం రోజుల కింద మండల, పట్టణ కమిటీల ఏర్పాటు పేర్ల ఓ లిస్టును కొమ్మూరి వర్గీయులు సోషల్ మీడియా గ్రూపుల్లో వేయడంతో పార్టీలో కలకలం రేపింది. పట్టణ, మండల అధ్యక్షుల ఎన్నిక జరుగకుండా కమిటీల లిస్టులను వాట్సప్ గ్రూపుల్లో పెట్టడంపై డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి విబేధించి పార్టీ హైకమాండ్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో ఆమె వర్గీయులు మరునాడు ఆ కమిటీలు చెల్లుబాటు కావంటూ పోస్టులు పెట్టడం పార్టీలో మరింత చర్చనీయాంశంగా మారింది. దీంతో అప్పటి వరకు కాంగ్రెస్ లో జరుగుతున్న అంతర్యుద్ధం ఒక్కసారిగా బహిర్గతమైంది. మరి ఈ యుద్ధం ఎటు దారితీస్తోందో వేచి చూడాలి మరి..!





# జనగామ కలెక్టర్ బిజీబిజీ

## పొద్దంతా కొనుగోలు కేంద్రాల తనిఖీలు.. సాయంత్రం సమీక్షలు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం రోజంతా బిజీబిజీ గడిపారు. ఉదయం జిల్లాలోని స్టేషన్ఘన్‌పూర్ మండలం శివునిపల్లి, లింగాలఘణపురం మండలం కుందారం, దేవరుప్పుల మండలం కోలుకొండ, పాలకుర్తి మండలం ఈరవెన్ను, అయ్యాంగారిపల్లి, గూడూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి, కొనుగోళ్లకు సంబంధించిన రిజిస్టర్లను, ఇప్పటివరకు కేంద్రాలకు వచ్చిన ధాన్యం, అందులో ఎంత కొనుగోలు చేశారు? ఎంత మిల్లులకు తరలించారు? లారీల గురించి కలెక్టర్ కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే కొనుగోలు చేసి అన్‌లోడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ధాన్యం తూకం, నాణ్యత పరిశీలన పారదర్శకంగా నిర్వహించాలని, కొనుగోలు అనంతరం వెంటనే రశీదులు అందజేయాలని తెలిపారు. కేంద్రాల్లో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను సక్రమంగా పరిశీలిస్తూ రైతులకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని అన్నారు. అదే విధంగా ధాన్యం నిల్వ, రవాణా ప్రక్రియలను వేగవంతం చేసి ఎక్కడా నిల్వలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. కుందారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కూడా కలెక్టర్ పరిశీలించి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.



### సాయంత్రం సమీక్షలు...

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గన్ని బ్యాగుల నిల్వలు, హమాలీల అందుబాటు, గోదాముల సామర్థ్యం, రవాణా పరంగా తీసుకున్న చర్యల వివరాలను మార్క్‌ఫెడ్ డీఎంను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు సరిపడా గన్ని బ్యాగులు చేరేలా చర్యలు తీసుకోవాలని, అవసరానికి అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలని అధికారులను ఆదేశించారు. పంట అధికంగా వచ్చే కేంద్రాలను నిరంతరం తనిఖీ చేస్తూ, కొనుగోలు ప్రక్రియ ఎటువంటి అంతరాయం లేకుండా సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, షెడ్లు, తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఆర్‌డీవో భాస్కర్, మార్క్‌ఫెడ్ డీఎం చంద్రశేఖర్, ఆత్మ డీపీడీ విజయ శ్రీ, డీసీఓ కోదండరాములు, డీఎంఓ రామకృష్ణ, అదనపు డీఆర్‌డీవో నూరుద్దీన్, ఏఎంవీఐ శ్వేత పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో నిలువు దోపిడీ : సీపీఎం

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** మండలంలోని ఖిలాషాపూర్ అన్నపూర్ణ ఐకేపీ కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న అక్రమాలపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, బాధ్యులైన మిల్లర్లు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ రఘునాథపల్లి మండల కార్యదర్శి కావటి యాదగిరి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. స్వయంగా తాను సాగు చేసిన 217 బస్తాల ధాన్యాన్ని (86 క్వింటాళ్ల 80 కిలోలు) ఐకేపీ కేంద్రంలో తూకం వేయగా, అక్కడ నిబంధనలకు విరుద్ధంగా బస్తాకు 41 కిలోల 100 గ్రాముల చొప్పున జోకారని ఆరోపించారు. సెంటర్‌లో అదనపు తూకం వేయడమే కాకుండా, మిల్లర్ల వద్దకు వెళ్ళిన తర్వాత మళ్ళీ బస్తాకు ఒక కిలో చొప్పున కోత విధిస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమాలపై ప్రశ్నిస్తే "అధికారులందరికీ తెలిసే జరుగుతోంది" అని నిర్వాహకులు బాధ్యతారాహిత్యంగా సమాధానం చెబుతున్నారని, తనకే సుమారు రూ.1,850 మేర నష్టం వాటిల్లితే, సామాన్య రైతుల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేసినప్పుడు అక్రమాలు జరగడం లేదని స్టేట్మెంట్ ఇచ్చిన సివిల్ సప్లై మేనేజర్, ఇప్పుడు కల్లాల వద్దకు వచ్చి క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని యాదగిరి హెచ్చరించారు.



# కలెక్టర్‌పై ఆరోపణలు సరికాదు

- వాస్తవాల ఆధారంగానే విమర్శలు ఉండాలి
- ఆరోపణలపై స్పందించిన జిల్లా యంత్రం



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝాపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని జిల్లా యంత్రం పేర్కొంది. బుధవారం పలు పత్రికల్లో వచ్చిన కథనాలకు యంత్రంగా స్పందించింది. హైకోర్టు ఆదేశాల మేరకు ఇటీవల కలెక్టరేట్ చుట్టు పక్కల ఉన్న టీ స్టాల్‌ను తొలగించామని, అదేవిధంగా కలెక్టరేట్ ప్రాంగణంలో సుమారు 80 క్లెయిమ్ చేయని వాహనాలు నిల్వ ఉండటాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఇవి అగ్ని ప్రమాదం, భద్రతా సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నదున్న పోలీసు శాఖ, ఆర్టీఏ సహకారంతో తొలగించామని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయబద్ధమైన విమర్శలను, పత్రికా పరిశీలనను స్వాగతిస్తుందని పేర్కొంది. అయితే విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలని, కల్పిత ఆరోపణలు చేయరాదని స్పష్టం చేసింది. పాలనా చర్యలను 'నిరంకుశం'గా అభివర్ణించడం వాస్తవాలకు విరుద్ధమని తెలిపింది. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హైకోర్టు ధృవీకరణతో రాజ్యాంగబద్ధంగా, పారదర్శకంగా విధులు నిర్వహిస్తున్నారని, ఆయనపై కొందరు కావాలనే ఆరోపణలకు దిగుతున్నారని పేర్కొన్నారు.

# జాతీయ స్థాయికి ముల్కనూరు కీర్తి

- జాతీయ స్థాయి కిక్‌బాక్సింగ్‌కు శ్రీనిధి



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు గ్రామానికి చెందిన యువ క్రీడాకారిణి గోల్లేన శ్రీనిధి కిక్‌బాక్సింగ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి గ్రామానికే కాదు జిల్లా స్థాయిలోనూ గర్వకారణంగా నిలిచింది. చిన్న గ్రామం నుంచి పెద్ద లక్ష్యాలతో ముందుకు సాగిన ఆమె, క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించి అందరి ప్రశంసలు అందుకుంటోంది. రంగారెడ్డి జిల్లాలో ఈ నెల 9, 10 తేదీల్లో ఘనంగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్-2026లో గురు మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటగా, సీనియర్ విభాగం 94 కిలోల కేటగిరీలో పోటీ చేసిన గోల్లేన శ్రీనిధి తన శక్తివంతమైన ప్రదర్శనతో ప్రత్యర్థులను అధిగమించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఆమె పోరాట పటిమ, ఆత్మవిశ్వాసం, సమయస్ఫూర్తి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. గ్రామీణ ప్రాంతానికి చెందినప్పటికీ, ఉన్నత స్థాయిలో క్రీడల్లో రాణించాలని లక్ష్యంగా పెట్టుకున్న శ్రీనిధి ప్రతిరోజూ కఠిన సాధన చేస్తూ ముందుకు సాగుతోంది. కోచ్ సిరిగిరి సాంబశివ, మాస్టర్ సిరిగిరి తిరుపతి మార్గదర్శకత్వంలో శిక్షణ పొందుతున్న ఆమె అనేక పోటీల్లో పాల్గొని తన ప్రతిభను నిరూపించుకుంది. రాష్ట్ర స్థాయి విజయంతో ఆమె త్వరలో మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు ఎంపిక కావడం విశేషం. శ్రీనిధి విజయంపై ముల్కనూరు గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, గ్రామ పెద్దలు, యువత ఆమెను ఘనంగా అభినందించారు. "ముల్కనూరు గ్రామ యువతికి ఇది గర్వకారణం. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిస్తున్నాం" అని వారు పేర్కొన్నారు.



మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక
గురువారం, 14 మే 2026
Mana Chourasta


# రైతులు యూరియా వాడకం తగ్గించాలి

## రఘునాథపల్లిలో 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు'

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** వ్యవసాయ సాగులో యూరియాను తక్కువగా వాడుతూ సాగు ఖర్చులను తగ్గించుకోవాలని జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం. యాకాద్రి సూచించారు. జనగామ జిల్లా రఘునాథపల్లిలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ సహకారంతో నిర్వహించిన 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచక్షణారహితంగా యూరియా వాడితే నేల ఆరోగ్యం దెబ్బతిని అనేక అనర్థాలు వస్తాయని హెచ్చరించారు. కేవలం కొన్ని పంటలకే పరిమితం కాకుండా పంట మార్పిడి పాటించాలని, పప్పు దినుసులు, నూనె గింజల సాగును పెంచాలని రైతులకు సూచించారు. వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఆర్. ఉమారెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం రూపొందించిన వరి, కంది, పెసర వంటి వంగడాలను పండించి రైతులు మంచి లాభాలు సాధించాలని కోరారు. విద్యుత్



విభాగ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రసాయన మందులను అతిగా వాడకుండా సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని సూచించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. శ్రవణ్ కుమార్ వరి సాగులో యాజమాన్య పద్ధతుల గురించి, జీవసాంకేతిక శాస్త్రవేత్త డాక్టర్ వై. హరి వరిలో మంచి ధర లభించే రకాల గురించి వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ సభ్యులు యాదగిరి సాగుపై రైతులకు సలహాలిచ్చారు. వ్యవసాయ సహాయ సంచాలకుల బాధ్యులు డాక్టర్ చంద్రన్, మండల వ్యవసాయ అధికారి కరుణాకర్, వరంగల్ ఏరువాక శాస్త్రవేత్త రాజ్ కుమార్, మండల ఉద్యాన అధికారిణి సంతోషిణి, విస్తరణాధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



**జనగామ, మన చౌరాస్తా :** స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని కొనుగోలు కేంద్రాలలో ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, నియోజకవర్గ బాధ్యులు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) కోరారు. ఈ మేరకు బుధవారం జనగామ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు, కూలీలకు అవసరమైన తాగునీరు, నీడ వంటి కనీస వసతులు కల్పించాలని అధికారులను కోరారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగకుండా చూడాలని, రైతులు ఇబ్బందులు పడకుండా త్వరితగతిన ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'కుట్ర రాజకీయాలతో బీజేపీని అడ్డుకోలేరు'



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ బీఆర్ఎస్ నాయకులపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మండల శాఖ అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై చేస్తున్న అరాచకాలు, ప్రజా సమస్యలపై ఒక్కసారి కూడా స్పందించని బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు ఆధారాలు లేని కేసులను ముందుకు తెచ్చి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుటుంబాన్ని రాజకీయంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు దర్యాప్తు అధికారుల మాదిరిగా వ్యవహరిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కె . చంద్రశేఖర్ రావు కుటుంబ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలు, ప్రజా వ్యతిరేక చర్యలపై బీజేపీ, బండి సంజయ్ నిరంతరం ప్రజల తరఫున పోరాటం చేస్తున్నందుకే కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎన్ని కుట్రలు చేసినా చివరికి నిజం, న్యాయమే గెలుస్తాయని పేర్కొంటూ, ఇకపై బీఆర్ఎస్ నాయకుల అవినీతి, భూకబ్జాలు, ప్రజా వ్యతిరేక చర్యలను గ్రామ గ్రామానికి తీసుకెళ్లి ప్రజల సహకారంతో బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, బొజ్జపురి పృథ్వీరాజ్, దొంగల రణప్రతాప్, లక్కిరెడ్డి మల్లారెడ్డి, సోప్పరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ లోడింగ్ స్పీడప్ చేయాలి

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** మిల్లర్లు సరిపడా హమాలీలను అందుబాటు ఉంచుకుని ఆన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా అడిషనల్ కలెక్టర్ బెన్ షా లోమ్ సూచించారు. బుధవారం బచ్చన్నపేట మండలంలోని మిత్ర మిల్లును ఆయన పరిశీలించారు. సరిపడా హమాలీలను పెట్టుకోవాలని మిల్ యాజమానిని ఆదేశించారు. అలాగే బచ్చన్నపేట మండలం చిన్నరామంచర్ల లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి సమస్యలు రాకుండా సాఫీగా పూర్తి అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు.



# చేరాలు కుటుంబానికి సీపీఎం నేతల పరామర్శ

**చిల్పూర్, మన చౌరాస్తా :** మండలంలోని క్రిష్టాజిగూడెం గ్రామానికి చెందిన జీఎంపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉడుత రవీందర్ సోదరుడు ఉడుత చెరాలు అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించడం పట్ల సీపీఎం రాష్ట్ర నాయకత్వం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. బుధవారం బాధిత కుటుంబాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్‌వెస్లి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్ పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక సంఘం రాష్ట్ర కార్యదర్శి స్కైలబ్ బాబు, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, లెల్లెల్ల బాలకృష్ణ, అశయ్య, మానుకోట జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు పైయ్యావుల మల్లయ్య, బొల్లం అశోక్ పాల్గొన్నారు. వీరితో పాటు హన్మకొండ జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి కాడబోయిన లింగయ్య, సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆలేటి యాదగిరి, జనగామ జిల్లా అధ్యక్షుడు మోటె దేవేందర్, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి కన్నెబోయిన బాలరాజు నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి సాధం రమేష్, గ్రామ కార్యదర్శి పోలు సంపత్, ఉపసర్పంచ్ గద్ద కోమల, వార్డు సభ్యులు ఊరడి బుచ్చిరాజు, సీనియర్ నాయకులు సాదం పరమేష్, సాదం శ్రీనివాస్, ఊరడి రవి, ఊరడి లింగయ్య, సాదం రాజు, నారబోయిన భిక్షపతి, గద్ద కుమార్ తదితరులు పాల్గొని కుటుంబానికి భరోసా కల్పించారు.

# మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే నవీన్

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ బుధవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు శాంతి సౌభాగ్యాలతో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్, కిసాన్ సెల్ బొచ్చు ఎల్లయ్య యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏర్పుల రాజు, మాజీ సర్పంచ్ చెరుకు రమణా రెడ్డి, యూత్ సెక్రటరీలు ఉప్పల వంశీ, యేనిశెట్టి కిరణ్, టౌన్ యూత్ గుండా మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈగ కనకరాజు, సార్ల కొల్ బాయ్ కనకయ్య, పుట్ట శ్రీనివాస్, చింతల రమేష్ పాల్గొన్నారు.



# బీసీ రాజ్యాధికార పాదయాత్ర ప్రారంభం



**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** బీసీ రాజ్యాధికారమే ధ్యేయంగా బీసీ రాజ్యాధికార వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఐతగోని రాఘవేంద్ర గౌడ్ (రాఘవన్న) పాదయాత్ర చేపట్టారు. బుధవారం జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ గ్రామంలోని బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న కోట నుండి ఈ పాదయాత్రను చేపట్టారు. ఈ పాదయాత్రకు తెలంగాణ ప్రొటెక్షన్ పోర్స్ చైర్మన్ సుదగాని హరిశంకర్ గౌడ్ హాజరై రాఘవేంద్ర గౌడ్ పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 8 దశాబ్దాలు కావస్తున్నా బీసీలు వెనుక బడిన తరగతులుగా ఎందుకు మిగిలి పోయారని, పార్టీలు ఎన్ని మారిన బీపీల తలరాతలు మారలేదని అన్నారు. బీసీ రాజ్యాధికార సాధనే లక్ష్యంగా రాఘవేంద్ర గౌడ్ (రాఘవన్న) చేపడుతున్న రాజ్యాధికార పాదయాత్రలో విద్యార్థులు, యువకులు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, సబ్బండ వర్గాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోపా రాష్ట్ర అధ్యక్షులు బండి సాయన్న గౌడ్, మధుసూదన్ గౌడ్, హరిబాబు, వంశీ, సంజీవ అలియాస్ (తల్వార్ తాత), మహేష్, లలిత, స్వామి, శివ పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన హిందూ బాల సంస్కార శిక్షణ

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీ శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ప్రముఖ ఆధ్యాత్మిక తత్వవేత్త డాక్టర్ మోహనకృష్ణ భార్గవ ఆధ్వర్యంలో మైలారం శ్రీనివాస్, చిలువేరు హర్షవర్ధన్, ఉల్లెంగుల రాజు, బుధారపు లావ్యణ్య, ప్రమోద్, అంబటి బాలరాజు సమన్వయ నిర్వహణలో గత పన్నెండు రోజుల పాటు 'హిందూ బాల సంస్కార శిక్షణ' తరగతులు నిర్వహించారు. కాగా ఈ శిక్షణ శిభిర ముగింపు 'సమారోప్ వేడుకలు' మంగళవారం రాత్రి అత్యంత ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, పౌరాణిక పాత్ర వేషధారణలు, ఆధ్యాత్మిక, దేశభక్తి గీతాలు, ఆటపాటలు వంటి అనేక కార్యక్రమాలతో అలరించారు. విద్యార్థులతో వారి తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించి కుటుంబ విలువలను చాటిచెప్పారు. హనుమాన్ జన్మోత్సవ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, అతిథులు అందరూ కలిసి సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. హనుమ నామ స్మరణతో దేవాలయ ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వహిందూ పరిషత్ విభాగ్ సంఘటన మంత్రి శివరాములు, అతిథిగా దేవస్థాన గౌరవాధ్యక్షులు గజ్జెల నర్సిరెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఎనగందుల భిక్షపతి, ప్రముఖ వైద్యులు డాక్టర్ గోపీచంద్, ఆర్టీఏ మెంబర్ చిలువేరు అభిగౌడ్ పాల్గొన్నారు. శిక్షణలో పాల్గొన్న నూటా పదిహేను మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, హనుమాన్ చాలీసా పుస్తకాలు, పెన్నులు, మెటీరియల్, బాక్సులు ఇతరత్రా అందించారు.





## మూాచ్చటగా మూాడోసారి

### బన్నీతో మరోమారు జతకట్టనున్న పూజా

బుట్టబొమ్మ పూజా హెగ్డే కు అదృష్టం పట్టిందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. పూజా వరుసగా అరడజను సినిమాలు డిజాస్టర్ అందుకున్నాయి. ఈ లెక్కన పూజా హెగ్డే పేరు కూడా ఎక్కడా వినిపించ కూడదు. కానీ, అదేంటో ఈ చిన్నది వరుస ప్లాపులను అందుకున్నా అవకాశాలు మాత్రం కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి. ప్రస్తుతం పూజా చేతిలో మూడు సినిమాలు ఉన్నాయి. ఇప్పటికే ఆమె నటించిన జననాయగన్ రిలీజ్ కి సిద్ధమవుతోంది. ఇది కాకుండా హిందీలో వరుణ్ ధావన్ సరసన తేరా హో జాన్ సినిమాలో పూజా నటిస్తోంది. ఇందులో అమ్మడి అందాల ఆరబోత చూసి ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు. ఇక ఇప్పుడు పూజా మరో లక్కీ ఛాన్స్ ని పట్టేసిందని సమాచారం. అల్లు అర్జున్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెల్సిందే. కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ నటిస్తోన్న రాకా శరవేగంగా షూటింగ్ జరుపుకొంటుంది. దీని తరువాత బన్నీ, మరో కోలీవుడ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ డైరెక్షన్ లో ఒక సినిమా చేయనున్న విషయం తెల్సిందే. ఈ చిత్రంలో బన్నీకి జోడిగా పూజా హెగ్డే పేరును అనుకుంటున్నారట. ఇప్పటికే బన్నీతో దువ్వాడ జగన్నాథం, అల వైకుంఠపురంలో లాంటి సినిమాల్లో నటించింది. ఇక ఇప్పుడు ముచ్చటగా మూడోసారి ఈ జంట రొమాన్స్ చేయనున్నారు. త్వరలోనే లోకేష్ .. పూజాను అధికారికంగా సినిమాలోకి ఆహ్వానించనున్నాడట. అయితే పూజా అదృష్టం బానే ఉన్నా.. మార్కెట్ పరంగా బన్నీకి రిస్క్ అని కొందరు చెప్పుకొస్తున్నారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**